క్లుప్తంగా

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



భాస్కరరావుకు ఆర్థిక సహాయం అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధి వీరబాబు

బోట్‌క్లబ్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి సానా సతీష్ బాబు ఫౌండేషన్, హరీష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా స్థానిక రేచర్లపేటకు చెందిన భాస్కరరావు ఆదివారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయా సంస్థల తరఫున ట్రస్ట్ ప్రతినిధి వీరబాబు భాస్కరరావు కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. ఈ మేరకు సానా సతీష్ బాబు, తలాటం హరీష్‌కు భాస్కరరావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పచ్చిపాల కోడి శ్రీను, పచ్చిపాల చంద్రి, సతీష్, రవికిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో నేరేళ్లమ్మ అమ్మవారు

తొండంగి: మండలంలోని గోపాలపట్నంలో వేంచేసిన నేరేళ్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు, సప్తనదీజలాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చండీహోమం, పంచహారతులు, లక్ష దీపారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నవరం గ్రామానికి చెందిన బాలికలు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం భక్తిపాటలు, భజనలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హాస్టల్ వార్డెన్ పి.ప్రభాకర్ ఆదివారం తెలిపారు. ఆసక్తి కలిగిన 6 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వసతి గృహంలో మంచి విద్య, పౌష్టికాహారం, అన్ని సౌకర్యాలతో వసతిని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఈ హాస్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పనితీరును పునఃపరిశీలించుకోవాలి

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికలో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి అభ్యర్థి పరాజయం పాలవడాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పనితీరును పునఃపరిశీలించుకోవాల్సిన అవసరముందని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే నెహ్రూ అలియాస్ కుప్పుస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమిష్టి వాయం ఓటమితో ముఖ్యమంత్రి రంగసామి ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు.

డీఎస్ఏ.. క్రీడా కార్ఖానా..

- వేసవి శిబిరాల పేరుతో క్రీడాకారులకు శిక్షణ
- వేల సంఖ్యలో విద్యార్థులకు తర్ఫీదు
- బాల్యం స్మార్ట్ ఫోన్‌కు బానిస కాకుండా అభిరుచి ఉన్న క్రీడలో మెరికల్లా తయారు
- రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడలకు సన్నద్ధత



తైక్వాండోలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్మార్ట్ ఫోన్ ప్రపంచంలో ఆటపాటలు, క్రీడలు కనుమరుగైపోయాయి. కాకినాడలో మాత్రం వేసవిని ఆహ్లాదకరంగా మారుస్తూ వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు 20 ఏళ్లుగా కాకినాడ డీఎస్ఏ క్రీడా మైదానంలో ఏటా వేసవిలో క్రీడాశిక్షణ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను వివిధ క్రీడల్లో తీర్చి దిద్దుతున్నారు. ఈ ఏడాది నిర్వహించిన వివిధ శిబిరాల్లో సుమారు 2000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సోమవారంతో ఈ శిబిరాలు ముగియనున్నాయి.

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏటా డీఎస్ఏతో పాటు, జిల్లాలో రూరల్, అర్బన్ ప్రాంతాల్లో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహించేవారు. అయితే ఈ ఏడాది ఎన్నికలు మే నెలలో జరగడంతో కేవలం డీఎస్ఏలో మాత్రమే శాప్ ఆదేశాల మేరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు వేసవి శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయి. ఈ శిబిరాలకు తమ పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహాన్ని చూపుతున్నారు. వందల సంఖ్యలో విద్యార్థులు ఈ శిబిరాల్లో శిక్షణ పొంది తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచుకున్నారు.

ఉదయం 6 గంటల నుంచే...

సాధారణంగా సెలవులు వచ్చాయంటే ఎక్కువ శాతం మంది పిల్లలు మైదానాలు, ఖాళీ స్థలాల్లో క్రికెట్ ఆడుతూ కనిపిస్తారు. కానీ జిల్లా క్రీడామైదానంలో మాత్రం ఆయా క్రీడల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం చూస్తాం. ఉదయం 6 గంటల నుంచే విద్యార్థులు మైదానానికి భారీగా చేరుకుంటారు. ఈ శిక్షణ 9 గంటల వరకు ఉంటుంది. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు కొనసాగుతుంది. ఏటా 30 రోజులు శిక్షణ ఇచ్చేవారు. ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో మే 15 నుంచి జూన్ 10 వరకు కొనసాగుతాయి. క్రీడా మైదానంలో బాస్కెట్‌బాల్, క్రికెట్, స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్, వాలీబాల్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, హాకీ, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో అనుభవజ్ఞులైన కోచ్‌ల ఆధ్వర్యంలో డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ పర్యవేక్షణలో శిక్షణ అందిస్తున్నారు. వందలాది సంఖ్యలో విద్యార్థులు ఈ శిబిరాల్లో వారికి అభిరుచి ఉన్న క్రీడల్లో తర్ఫీదు పొందుతున్నారు. క్రీడలతో విద్యార్థి దశ నుండే ఆలోచనా శక్తి పెరగడంతో పాటు వారిలో సృజనాత్మక శక్తి మెరుగుపరచేందుకు వీలుగా శిక్షణ అందిస్తున్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో నైపుణ్యం కల్గిన క్రీడాకారులను గుర్తించి వారికి ఏడాది పొడవునా శిక్షణ ఇచ్చి మెరికెల్లా తయారు చేసి రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతారు.

వేసవి శిక్షణతో నైపుణ్యం మెరుగు

విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడానైపుణ్యాలు మెరుగుపరచేందుకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు దోహదపడతాయి. అనుభవజ్ఞులైన కోచ్‌ల ఆధ్వర్యంలో సుమారు 13 క్రీడాంశాల్లో శిక్షణ అందిస్తున్నాం. వేసవి శిక్షణ శిబిరాలు ముగిసినా, నిరంతర శిక్షణకు చేరవచ్చు. ఆసక్తి గల వారు 89196 42248 నెంబరులో సంప్రదించవచ్చు.

– బి.శ్రీనివాస్‌కుమార్, డీఎస్‌డీఓ, కాకినాడ డీఎస్ఏ



జిల్లా క్రీడా మైదానంలో క్రికెట్‌లో మెళకువలు నేర్పుతున్న కోచ్‌లు



హాకీలో మెళకువలు నేర్చుకుంటున్న చిన్నారులు



అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు

హిందూ ధర్మ పరిరక్షణలో కానుగోవి కృషి అద్వితీయం

బోట్‌క్లబ్: హిందూ ధర్మ పరిరక్షణకు రాచూరి రాఘవేంద్రస్వామి ఎంతో పాటుపడ్డారని ఉత్తరాదిమఠ ప్రత్యేక అధికారి సుధా పండితులు కానుగోవి వాసుదేవాచార్ అన్నారు. కాకినాడ మధ్వ సభ కమిటీ అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్ర స్వామి సంతాప సభ ఆదివారం కందాలం నరసింహారావు అధ్యక్షతన జరిగింది. వివాహ పరిచయ వేదికను ఏర్పాటుచేసి సుమారు వెయ్యి మందికి పైగా వివాహాలు జరిపించారన్నారు. రాచూరి మరణం తీరని లోటన్నారు. సుధా పండితులు సుమంత్ ఆచార్ పాటిల్ మాట్లాడుతూ గురువుల ఆశయాలకు అనుగుణంగా ఆలోచించడమే కాక వాటి ఆచరణలో కూడా అంకితభావంతో పనిచేసిన వ్యక్తిగా కీర్తించారు. పండితులకు సముచిత ప్రాధాన్యం కల్పించడంలో శ్రద్ధ తీసుకునేవారన్నారు. కార్యక్రమంలో మధ్వ పురోహితులు యతగిరి మధ్వేష్, కమిటీ కార్యదర్శి కోపల్లె శేషగిరిరావు, లోక రాఘవేంద్రరావు, కాశీ రావు తదితరులు పాల్గొన్నారు.

బాలల్లో నేర ప్రవృత్తి ఆందోళనకరం

కాకినాడ రూరల్: బాలల్లో పెరుగుతున్న నేర ప్రవృత్తి ఆందోళనకరమని న్యాయవాది రాణి ఆవేదన వ్యక్తం చేశారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ నేడు ఒంటరి కుటుంబాలు ఏర్పడడంతో పిల్లలపై తల్లిదండ్రుల అజమాయిషీ తగ్గి, దురాలవాట్లకు లోనవుతున్నారన్నారు. సిగరెట్లతో మొదలై గంజాయి వంటి వాటికి అలవాటు పడుతుండడంతో నేర ప్రవృత్తి పెరిగిపోతోందని, తల్లిదండ్రులు పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

ముసుగు తొలగింపులోనూ పచ్చపాతం



ఏలేశ్వరం పాత బస్టాండ్ వినాయకుని గుడి వద్ద వైఎస్సార్ విగ్రహానికి తొలగించని ముసుగు



ఏలేశ్వరం మెయిన్‌రోడ్ ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు తొలగించిన దృశ్యం



మార్కెట్ వీధిలో ముసుగు తొలగించని వైఎస్సార్ విగ్రహం

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగిసినా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలగించలేదు. ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో ఈ నెల 6తో ఎన్నికల కోడ్ ముగిసింది. కోడ్ ముగిసి మూడు రోజులు గడుస్తున్నా అధికారులు పట్టణంలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలగించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని వినాయకుని ఆలయం వద్ద, మార్కెట్ వీధి, నర్సీపట్నం రోడ్డు, యర్రవరం రోడ్డు తదితర ప్రాంతాల్లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించలేదు. కాగా యర్రవరంరోడ్‌లోని మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి ముసుగు తొలగించారు. దీంతో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముగుసులు తొలగించడంలోనూ అధికారులు వివక్ష చూపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పట్టణంలో ఉన్న మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడానికి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెవెరెండ్ దొమ్మేటి శామ్యూల్ సాగర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై నుంచి డిసెంబర్ వరకూ రోజూ ఉదయం 10 గంటల నుంచి మెట్టకూరు చంద్రశేఖర్ నగర్ బాప్టిస్టు చర్చి ఆవరణలో శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 99854 67999 మొబైల్ నెంబరులో సంప్రదించాలన్నారు.

ఏలేరులో తగ్గిన నీటి నిల్వలు



ఏలేరు ప్రాజెక్టు గేట్ల వద్ద అడుగంటిన నీటి నిల్వలు

ఏలేశ్వరం: వేసవి నేపథ్యంలో స్థానిక ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటి సరాఫరా అంతంతమాత్రంగా ఉండడంతో జలాశయంలో నీటినిల్వలు తగ్గుతున్నాయి. ఆదివారం నాటికి జలాశయంలో రూ.86.56 మీటర్లకు గాను 68.58 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 3.61 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దిగువ ప్రాంతంలో పంటసాగు లేకపోవడంతో ఆయకట్టుకు నీటి విడుదలను నిలిపివేశారు. విశాఖకు 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజు చెరువుకు సైతం సరాఫరాను నిలిపివేశారు.

ఆంజనేయస్వామి ఆలయానికి టీవీ బహూకరణ



ఎ.మల్లవరంలో ఆంజనేయస్వామి ఆలయానికి టీవీ బహూకరిస్తున్న దాత అప్పలరాజు

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరంలో వేంచేసిన ఆంజనేయస్వామి ఆలయానికి స్థానిక రిటైర్డ్ వీఆర్ఓ గవిరెడ్డి అప్పలరాజు టెలివిజన్ (టీవీ)ను బహూకరించారు. అప్పలరాజు తన సొంత సొమ్ముతో కొనుగోలు చేసిన టీవీని స్థానిక టీడీపీ నాయకులు లెక్కల రాము, గవిరెడ్డి గురునాథ్, లెక్కల జోగిబాబు తదితరులు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో , పోలుపర్తి అప్పలనాయుడు, కాళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



వేలంకలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కిర్లంపూడి: మండలంలోని వేలంకలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా హనుమాన్ యూత్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాటి విద్యార్థుల ఆత్మీయ కలయిక



వాకలపూడి హైస్కూల్‌లో ఫొటో తీయించుకున్న పూర్వ విద్యార్థులు

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి హైస్కూల్ 1996–2002 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులతో కలసి సందడిగా గడిపారు. ఎవరెవరు ఎక్కడెక్కడ ఏయే పనులు చేస్తున్నదీ క్షేమ సమాచారాలు తెలుసుకుని చిన్ననాటి సంగతులన్నీ గుర్తుచేసుకుంటూ ఉబ్బితబ్బిబ్బయిపోయారు. అనంతరం వారి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు బాప్టిస్టు చర్చి ప్రతిష్ఠ

యానాం: స్థానిక మెట్టకూరు గణపతినగర్‌లో నూతనంగా నిర్మించిన మదర్ సుశీల మెమోరియల్ బాప్టిస్టు చర్చి రెండో ఫ్లోర్ మందిర ప్రతిష్ఠ సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి క్రీమ్ సంస్థ డైరెక్టర్ వసంతరావుతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

ఓటు వేసిన ఫ్రెంచి పౌరులు

యానాం: యూరోపియన్ యూనియన్(ఈయూ) పార్లమెంట్ సభ్యుల ఎన్నికకు ఆదివారం నిర్వహించిన ఎన్నికలో పలువురు యానాం, పుదుచ్చేరి తదితర ప్రాంతాల్లోని ఫ్రెంచి పౌరులు పుదుచ్చేరి ఫ్రెంచి కాన్సులేట్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఫ్రెంచి పౌరుల ప్రతినిధి సాధనాల బాబు తెలిపారు. యూరోపియన్ యూనియన్‌లో మొత్తం 720 సీట్లు ఉండగా అందులో ఫ్రాన్స్‌కు 81 సీట్లు కేటాయించారన్నారు. యానాంలో ఉన్న పలువురు ఫ్రెంచి పౌరులు ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.

నీట్ కౌన్సెలింగ్‌పై సెంటాక్ సమాచారమిస్తుంది

యానాం: నీట్ కౌన్సెలింగ్‌కు సంబంధించి వివరాలు, బ్రోచర్, బులిటెన్‌ను సెంటాక్ వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తుంటామని పుదుచ్చేరి సెంటాక్ కన్వీనర్ అమన్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సెంటాక్ ఆఫీసుకు రావాల్సిన అవసరం లేదన్నారు. మెడికల్ కౌన్సిల్ కమిటీ(ఎంసీసీ) ఇచ్చే టైమ్‌లైన్స్‌ను బట్టి కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడతామన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తామని, పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో అందిస్తామన్నారు.

ఈ ప్రయాణం ఆహ్లాదం



తుని-ఎస్.చామవరం రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు

తుని రూరల్: రహదారికి ఇరువైపులా చెట్లు. ఆ చెట్ల నుంచి వీచే చల్లని గాలులతో తుని నుంచి ఎస్.చామవరం మీదగా హంసవరం వెళ్లే రోడ్డులో ప్రయాణం ఆహ్లాదకరంగా సాగుతోంది. ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రహదారులకు ఇరువైపులా వివిధ రకాల మొక్కలను పెంచింది. ఆ మొక్కలు పెరగడంతో రహదారులు ఆహ్లాదకరంగా మారాయి. ఈ రహదారితో పాటు డి.పోలవరం శివారు అశోక్ నగర్ గండి నుంచి దొండవాక, కేఓ మల్లవరం–లోవ కొత్తూరు చెరువుగట్టు నుంచి రాజుపేట వరకు ఇలా రహదారులు ఆహ్లాదంగా ఉన్నాయి. వేసవిలో ఆ రహదారుల్లో వెళ్లే ప్రయాణికులకు ఎండ నుంచి ఉపశమనం పొందడంతో పాటు చెట్లకింద కొంతసేపు ఆగి సేదతీరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అవగాహన రాహిత్యంతో వేసిన మొక్కలు పెరిగి విద్యుత్ లైన్లకు తాగడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. దీంతో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడంతో కళాహీనంగా మారుతున్నాయి. మొక్కలు నాటే సమయంలో విద్యుత్ లైన్లకు దూరంగా నాటాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రసాయనాలు ఫుల్.. ఆరోగ్యం కిల్

- పండ్ల పరిపక్వానికి జోరుగా రసాయనాల వినియోగం
- ప్రజల ఆరోగ్యానికి ముప్పు
- పట్టించుకోని అధికారులు

ఏలేశ్వరం: సహజసిద్ధంగా పండిన పండ్లు ఆరోగ్యకరం. రసాయనాలు వాడని పండ్లను ఆహారంలో భాగంగా తీసుకోవాలని వైద్యులు సైతం సూచిస్తున్నారు. కాగా ప్రస్తుతం పండ్లు కూడా విషపూరితంగా మారుతున్నాయి. పండ్లు త్వరగా పక్వానికి వచ్చేందుకు, ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు వ్యాపారులు రసాయనాలు వాడుతుండడంతో కొనుగోలుదారులు రోగాల బారిన పడుతున్నారు. దీనిపై ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

పలు గ్రామాల్లో...

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వ్యాపారులు పండ్లను మగ్గబెట్టేందుకు రసాయనాలు వినియోగిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రివాజు ప్రకారం అరటి, మామిడి, బొప్పాయి తదితర పండ్లు పక్వానికి వచ్చేవరకు కావువేసి పండిన తరువాత విక్రయించాలి. కాగా వ్యాపారులు పెట్టిన పెట్టుబడి వెంటనే చేతికి వచ్చేందుకు పండ్లకు కార్బాయిడ్ రసాయనం వాడి త్వరగా పరిపక్వానికి వచ్చేలా చేస్తున్నారు. దీంతో ఈ పండ్లను తిన్న కొనుగోలు దారులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు.



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధం చేసిన పండ్లు



రసాయనాల వాడకంతో రంగుమారిన ద్రాక్ష పండ్లు

2579 హెక్టార్లలో మామిడి సాగు

నియోజకవర్గంలో మామిడి 2579 హెక్టార్లు, అరటి 2359 హెక్టార్లల్లో పండిస్తున్నారు. వీటితో పాటు అక్కడక్కడ బొప్పాయి తోటలు పండిస్తున్నారు. అయితే అరటి, మామిడి పండ్లను సుదూర ప్రాంతాలకు తరలిస్తుంటారు. నియోజకవర్గంలో యర్రవరంలో అరటి మార్కెట్ ఉంది. అరటిపండ్లు త్వరగా పక్వానికి వచ్చేందుకు కార్బైయిడ్ రసాయనాన్ని ఉపయోగిస్తున్నారు. నియోజకవర్గంలో రోజువారీ వ్యాపారం నిమిత్తం అరటిగెలలు అమ్మేందుకు వ్యాపారులు రసాయనాన్ని వినియోగిస్తున్నారు. అలాగే బొప్పాయి, మామిడి పండ్లకు రసాయనాన్ని వాడుతున్నారు. వీటిని తిన్నవారు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

మామిడి పండ్లకు డిమాండ్

ప్రస్తుతం వేసవికాలం కావడంతో మామిడి పండ్లకు డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది దిగుబడి తక్కువగా ఉండడంతో మామిడి పండ్ల ధరలు భారీగా పెరిగాయి. పరక (13 పండ్లు) రూ.200 నుంచి రూ.250 వరకూ పలుకుతున్నాయి. కాగా ఇటీవల ఈదురుగాలులకు రాలిపోయిన కాయలను రసాయనాలతో పక్వానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వ్యాధులు వచ్చే ప్రమాదం

పండ్లకు రసాయనాన్ని వాడితే క్యాన్సర్‌తో పాటు పలురకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరిస్తున్నారు. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. కాగా దుకాణాల వద్ద వ్యాపారులు బహిరంగంగా రసాయనాలు వాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీనిపై అధికారులు స్పందించి వ్యాపారులకు అవగాహన కల్పిస్తే వారిలో మార్పు వస్తుందని ప్రజలు చెబుతున్నారు. అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.